### మేయర్ రాకపై క్లారిటీ

కార్పొరేషన్, ఆగస్టు 26: ఈ నెల 23న అమెరికా పర్యటనకు వెళ్లిన నగర మేయర్ యాదగిరి సునీల్ రావు సెప్టెంబర్ 6న కరీంనగర్‌కు తిరిగి రానున్నారు. ఈ మేరకు సోమవారం మేయర్ క్యాంప్ కార్యాలయం నుంచి మేయర్ రిటర్న్ టికెట్‌ను వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. దీంతో రెండు వారాల్లోనే మేయర్ కరీంనగర్‌కు తిరిగిరానున్నట్లు క్లారిటీ ఇచ్చారు. అలాగే నగర కమిషనర్‌కు కూడా మేయర్ సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

### విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

విద్యానగర్, ఆగస్టు 26: జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికున్ గున్యా తదితరాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఒక ప్రకటనలో కలెక్టర్, జిల్లా వైద్య అధికారులను కోరారు. భారీ వర్షాలకు తోడు గ్రామపంచాయతీల్లో పారిశుధ్యలోపం వల్ల కుటుంబాలకు కుటుంబాలే మంచాన పడ్డాయని తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో ప్లేట్ లెట్స్‌ను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారని, అక్కడ అవసరంలేని వైద్య పరీక్షలు, ఇతర చార్జీల పేరుతో రోగులను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి హాస్పిటళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే అన్ని గ్రామాల్లో మొబైల్ టీమ్‌ల ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సహాయం అందించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో దోమతెరలను పంపిణీ చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకుని జిల్లా సెంటర్ల వరకు ప్లేట్ లెట్స్ కౌంట్ మిషన్స్‌తో పాటు, హెల్త్ చెకప్, ఇతర వైద్య పరీక్షల పరికరాలు, మందులు, డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్‌తో పాటు, ఇతర స్టాఫ్‌ను సమకూర్చాలని కోరారు.

### కొత్తగట్టులో జ్వర సర్వే

శంకరపట్నం, ఆగస్టు 26: కొత్తగట్టు గ్రామంలో ఓ మహిళకు డెంగ్యూ పాజిటివ్‌గా తేలడంతో వైద్య ఆరోగ్య అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ పేషెంట్ ఇంటి పక్కల పరిసరాలను శుభ్రం చేయించారు. దోమల వ్యాప్తి నివారణకు బ్లీచింగ్, ఫాగింగ్ చేయించారు. జ్వర సర్వే చేపట్టారు. డెంగ్యూ, తదితర జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా మలేరియా విభాగం ప్రతినిధి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### బీసీ కుల గణనపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అభిలాష్

శంకరపట్నం, ఆగస్టు 26: బీసీ కుల గణనపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని జాతీయ బీసీ సంఘం మండలాధ్యక్షుడు బొంగోని అభిలాష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి ప్రభుత్వం తన హామీని అమలు చేయాలన్నారు. కుల గణన తర్వాత 42 శాతం రిజర్వేషన్ బీసీలకు అమలు చేశాకే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదా మండల కేంద్రంలో కుల సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో కుల గణన కోసం చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు బలవంతంగా భగ్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అభిలాష్ ప్రకటించారు. సంజయ్‌కు మద్దతుగా మండల కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలకు పూనుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రజక సంఘం మండలాధ్యక్షుడు తిరుపతి, వడ్డెర సంఘం ప్రతినిధి శివరాత్రి శ్రీనివాస్, మైనారిటీ అసోసియేషన్ ప్రతినిధి ఆరిఫ్, నాయకులు సంపత్ ముదిరాజ్, సాగర్ పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా కృష్ణాష్టమి వేడుకలు

రామడుగు : వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు
- ఉట్టి కొట్టేందుకు పోటీపడిన యువకులు

కమాన్‌చౌరస్తా/కరీంనగర్ రూరల్/ జమ్మికుంట/ సైదాపూర్/శంకరపట్నం/చొప్పదండి/ చిగురుమామిడి/ రామడుగు/ తిమ్మాపూర్/హుజూరాబాద్‌టౌన్, ఆగస్టు 25: జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం కనుల పండువగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఊరూరా ఉట్టి వేడుకలు నిర్వహించగా, చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని సందడి చేశారు. యువకులు ఉట్టికొట్టేందుకు పోటీ పడ్డారు. నగరంలోని దేవాలయాల్లో స్మార్త కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సాయినగర్ మురళీకృష్ణ మందిరంలో సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో గోపూజ, అర్చనలు నిర్వహించారు. అలాగే, జిల్లా కేంద్రంలోని గిద్దెపెరుమాళ్ల ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఉజ్వలపార్క్ వద్ద గల యాదవ భవన్‌లో శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేశారు. ఉట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా కోర్ కమిటీ సభ్యులు సొగాని కొమురయ్య, కన్నెబోయిన ఓదెలు, సందనవేని మహేందర్, కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగారపు సత్యనారాయణ, నన్నెబోయిన రవి, చెర్ల పద్మ, కాల్వ లక్ష్మి, మంచాల రవీందర్, మండల, గ్రామాల గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల అధ్యక్షులు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో రుక్మిణీ సత్యభామ సమేత మురళీకృష్ణుడు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. కరీంనగర్‌లోని సాయినగర్‌లో గల షిర్డీ సాయిబాబా ఆలయంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 రిజియన్ 8జోన్ చైర్‌పర్సన్ లయన్స్ చింతల కిషన్ పటేల్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. జమ్మికుంట పట్టణంలోని గీతామందిర్‌లో సేవా సంఘం, యాదవ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. సైదాపూర్, చిగురుమామిడి, శంకరపట్నం, చొప్పదండి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయంత్రం ఉట్టి వేడుకలు నిర్వహించగా, చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని సందడి చేశారు. అంతకుముందు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, భగవద్గీతా పారాయణం చేశారు. కేశవపట్నంలో తనుకు ప్రభాకర్ నివాసంలో ప్రత్యేక గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. అనంతరం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో తనుకు సోదరులు తిరుపతయ్య, ఓంకారం, సత్యనారాయణ, ప్రభాకర్, రాజకీయ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కృష్ణుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. పలు సంఘాలు, యూత్ సొసైటీల ఆధ్వర్యంలో ఉట్టి వేడుకలు నిర్వహించారు. రామడుగు మండలం వెలిచాల శ్రీ సరస్వతీ హైస్కూల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు వేణుగోపాలుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. పందికుంటపల్లి గ్రామానికి చెందిన కటుకం నవీన్, అఖిల దంపతుల ఇద్దరు కూతుళ్లు అయాన్సీ, ఆద్యశ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. రామడుగు, గోపాల్‌రావుపేట, వెలిచాల, వెదిర తదితర గ్రామాల్లో యువకులు ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. హుజూరాబాద్ పట్టణంలోని బృందావన్ చౌరస్తాలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. నాలుగేళ్ల తర్వాత ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు.

నగరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో బాలుడు

పందికుంటపల్లిలో గోపిక వేషధారణలో చిన్నారి

శంకరపట్నం; కేశవపట్నంలో తనుకు సోదరుల నివాసంలో గీతాపారాయణం చేస్తున్న భక్తులు

## వీసీవోసీ ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయాలి

కలెక్టరేట్, ఆగస్టు 26 : వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్‌లో వివిధ శిక్షణ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జె.సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, వీసీవోసీలో ఎనభై శాతం మంది ఉద్యోగులు దివ్యాంగులే ఉండగా, వీరికి ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి నిధులు విడుదల చేయాల్సిన ప్రభుత్వం ఐదు నెలలుగా బడ్జెట్ రిలీజ్ చేయకపోవడంతో వారి కుటుంబాలన్నీ కొద్ది మాసాలుగా వేతనాలు రాకపోవడంతో పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, సత్వరమే వేతనాలు విడుదల చేయాలని, లేనిపక్షంలో వారికి మద్దతుగా ఆందోళనలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పి.మనోహరాచార్యులు, దూడం వెంకటేశ్వర్లు, రౌతు విజయ్‌కుమార్, వెగ్గటం వెంకటస్వామి, కొక్కీస భాస్కర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేయాలి

జమ్మికుంట, ఆగస్టు26: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని ధర్మసమాజ్ పార్టీ మండల నాయకుడు మాడుగుల సందీప్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేయూత కింద వృద్ధులకు పింఛన్ రూ.4వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పటి వరకు అమలు చేయకపోవడాన్ని దుయ్యబట్టారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుంటే డీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రవితేజ, సాగర్ తదితరులున్నారు.

### మొక్కలు నాటిన లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ చిట్స్

మొక్క నాటుతున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ చిట్స్ ప్రతినిధులు

విద్యానగర్, ఆగస్టు 26: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ చిట్స్ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చీటీ సత్యనారాయణరావు, ప్రధాన కార్యదర్శి చింతా చంద్రశేఖర్, కోశాధికారి మడ్డి సమ్మయ్య గౌడ్, రీజియన్ చైర్ పర్సన్ మేచినేని సత్యనారాయణ రావు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమ సమన్వయ కర్త గుండోజు లక్ష్మయ్య, కార్పొరేటర్ ఆకుల ప్రకాశ్, క్లబ్ సభ్యులు రంజిత్ కుమార్, ప్రశాంత్, చరణ్ కుమార్, అనిల్ కుమార్, డి. శ్రీనివాస్, రాంరెడ్డి, అఖిల్ గౌడ్, రమేశ్ గౌడ్, చార్టర్డ్ అకౌంటెంట్ రమేశ్ పాల్గొన్నారు.

### యూపీఎస్ పెన్షన్ విధానం వద్దు

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ పథకం అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం తప్పదని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూ మహేందర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. 30-40సంవత్సరాలు నిస్వార్థ సేవ చేసిన ఉద్యోగికి విరమణ సమయంలో ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. ఉద్యోగి ఒక్క రూపాయి చెల్లించకుండానే సర్వీసును బట్టి 50శాతం ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

### ఎస్సీ కులగణన చేపట్టాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 26: ఎస్సీ కులగణన చేపట్టాలని ఎస్సీ 57 ఉలకులాల హక్కు పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వేణు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎస్సీ కులగణన చేసిన తర్వాతనే వర్గీకరణ అమలు చేయాలన్నారు. కులగణన చేపట్టకపోతే ఎస్సీ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు రవీందర్, రాజేశ్, అరవింద్, లోకేశ్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ ఇద్దరు యువకుల మృతి

ఇల్లందకుంట, ఆగస్టు 26: చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన మూడెడ్ల సురేశ్(21) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ రాజ్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న సురేశ్, ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగాక మతిస్థిమితం లేని వాడిలా ప్రవర్తించేవాడు. ఈనెల 18న గడ్డిమందు సేవించి తండ్రి ముత్తయ్యకు ఫోన్ చేశాడు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి జమ్మికుంట దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో సురేశ్ మృతి చెందాడు. ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వీణవంక, ఆగస్టు 26: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కాగిత సందీప్ (20) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్ముక్ల గ్రామానికి చెందిన కాగిత సందీప్ ఘన్ముక్ల ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు. కొద్ది రోజులుగా మానసిక స్థితి సరిగాలేక, కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 25న ఉదయం సందీప్ ఇంటి దగ్గర గడ్డి మందుతాగి ఆత్మహత్యానికి పాల్పడగా, జమ్మికుంటలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందినట్లు మృతుడి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### 29 నుంచి మండలస్థాయి పాఠశాలల క్రీడా పోటీలు

జమ్మికుంట, ఆగస్టు 26: ఈ నెల 29 నుంచి 31 వరకు జమ్మికుంట మండలస్థాయి పాఠశాలల క్రీడా పోటీలను స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి కే శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ పీడీ శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17సంవత్సరాల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు చదువుతున్న పాఠశాలలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు మండల విద్యావనరుల కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### సింగిల్ విండో భవన ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

గంగాధర, ఆగస్టు 26: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార సంఘం భవన ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ సోమవారం ప్రకటనలో కోరారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సహకార బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు చేతుల మీదుగా మంగళవారం భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘం పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 26: వీణవంక మండలం చల్లూరు ఇసుక క్వారీ నుంచి జహీరాబాద్‌కు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీ (టీఎస్ 08 యూడీ 1116)ని మానకొండూర్ తూర్పుదర్వాజ చౌరస్తావద్ద పోలీస్‌సిబ్బంది పట్టుకున్నారు. కర్నాటక బీదర్‌కు చెందిన డ్రైవర్ దగ్రే జగన్నాథంను అదుపులోకి తీసుకుని లారీని మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

### సుబ్రహ్మణ్యస్వామికి ఫల పంచామృతాభిషేకం

కరీంనగర్‌రూరల్, ఆగస్టు 25: కృత్తికా నక్షత్రం సందర్భంగా సోమవారం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి ఆలయ ధర్మాధికారి వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పవనకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### మహాశక్తి ఆలయంలో చండీ హోమం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 26 : జిల్లా కేంద్రంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో సోమవారం శ్రావణ బహుళ అష్టమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. మార్కండేయ పురాణంలోని 13 అధ్యాయాలతో కూడిన 700 మంత్రాలను పఠిస్తూ అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నిరుపేద చికిత్సకు సాయం చేయరూ

గాయపడిన షహీద్‌పాషా

గంగాధర, ఆగస్టు 26: కరెంటు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మండల కేంద్రానికి చెందిన షహీద్ పాషా వేడుకుంటున్నాడు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్క్ట్రీషియన్‌గా పని చేసేవాడు. మూడు నెలల క్రితం మండల కేంద్రంలో విద్యుత్ శాఖకు సంబంధించిన పనులకు కూలీగా వెళ్లాడు. విద్యుత్ పనులు చేస్తుండగా కరెంటు షాక్ కొట్టి కుడి చెయ్యిని కోల్పోయాడు, ఎడమ కాలు పూర్తిగా కాలిపోయింది. చికిత్స కోసం ఇప్పటి వరకు రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాలు ఆపరేషన్ కోసం మరో రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని, రెక్కాడితే గానీ డొక్కాడని తమకు అంత ఖర్చును భరించే స్థోమత లేదని వాపోయారు. దాతలు ఆదుకుని కాలి చికిత్సకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. ఆర్థిక సాయం చేసే దాతలు ఫోన్ పే నం.9502437864 కు పంపించాలని కోరారు.

### పోయిన ఫోన్లు.. పట్టుకున్న పోలీసులు

తిమ్మాపూర్, ఆగస్టు 26: మండలంలో పలు చోట్ల పలువురు ఫోన్లు పోగొట్టుకోగా.. సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు ఫోన్లను పట్టుకుని బాధితులకు అందజేశారు. ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో నలుగురు వ్యక్తులు వారి ఫోన్లను పోగొట్టుకున్నారు. ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి ఫోన్ యాజమానులకు సీఐ కార్యాలయంలో సీఐ స్వామి సోమవారం సాయంత్రం అందజేశారు. ఫోన్లు అప్పగించిన పోలీసులకు ఫోన్ల వినియోగదారులు కృతజ్ఞతలు తెలిపారు.

శంకరపట్నం, ఆగస్టు 26: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కళాకారుడు ఆకునూరి దేవయ్య తన రూ.80 వేల విలువైన స్మార్ట్ ఫోన్‌ను ఈ నెల 25న కేశవపట్నంలో పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో సీసీటీవీ పుటేజీలను పరిశీలించి, మొబైల్ ఫోన్‌ను కనిపెట్టి అతడికి అప్పటించినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

CHANGE OF NAME

★I, MOHAMMED MAHABOOB ALI, R/o. H.No. 3-65, Rudraram, Vemulavada, Rajanna Sircilla-505 402, TS, have Changed My Name to MAHABOB ALI.
NT-336769

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఆగస్టు 26 : ప్రభుత్వ ఉద్యోగులు గత కొద్ది మాసాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వోద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని పద్మనగర్‌లో గల తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయమంటూ అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అనంతరం తెప్ప తగలేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, కొత్త పీఆర్సీ ప్రకటించేందుకు మీన మేషాలు లెక్కిస్తుండడంపై ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూడా నిర్లక్ష్యం వహిస్తుండడం దారుణమన్నారు. పది నెలలు వేచి చూసినా ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు కూడా ఆహ్వానం పలుకకపోవడంతో, కాంగ్రెస్ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు వారు ప్రకటించారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వోద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.రాజ్‌మహ్మద్, ప్రతినిధులు ఇక్బాల్, కుమారస్వామి, ఆంజనేయులు, వొద్దమల్ల రాజమల్లు, బింగి భాస్కర్, సయ్యద్ ఇబ్రహీం, మహేందర్‌రెడ్డి, మైలారపు రాజేశ్వర్, రాఘవేందర్‌రావు, నోముల శంకర్‌రావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఘనంగా కొరివి కృష్ణస్వామి జయంతి

మానకొండూర్ రూరల్, ఆగస్టు 26: కొండపల్కల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపకుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బండి సంపత్ ముదిరాజ్, నాయకులు మట్టపెల్లి శంకర్ ముదిరాజ్, కొలిపాక రాయమల్లు, రంగు సంపత్ గౌడ్, గట్టు శ్రీధర్ ముదిరాజ్, గట్టు రమేశ్, గట్టు లింగయ్య, గట్టు రాజు, కడారి రమేశ్, వాసాల భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

### బొమ్మలమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

గంగాధర, ఆగస్టు 26: కురిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని బొమ్మలమ్మగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని చరిత్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సందవేని తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. చరిత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం ప్రముఖ చరిత్రకారుడు డాక్టర్ జైశెట్టి రమణయ్య చేతుల మీదుగా చరిత్ర పరిరక్షణ యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. యాత్రలో భాగంగా మొదటి రోజు జగిత్యాల జిల్లా పొలాస, కోటి లింగాల, మునులగుట్ట సందర్శించి రెండో రోజు కరీంనగర్ జిల్లాలోని కురిక్యాల బొమ్మలమ్మగుట్ట వద్ద యాత్రను ముగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుందారపు సతీశ్, రా